సాక్షి నిజామాబాద్

బుధవారం ၊ 6 ၊ మార్చి ၊ 2024



ఉత్సాహంగా విద్యుత్ క్రీడలు

విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడలు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.

- 8లో ▸



విద్యార్థులకు పోటీలు

నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో కోటగల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /21.5

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.



చూసిందంతా నిజం కాదు..!

ఈ చిత్రం చూస్తే రోడ్డుపై నుంచి నీరు పారుతున్నట్లు కనిపిస్తోంది. అయితే ఇదంతా భ్రమే..కొన్ని రోజులుగా ఎండలు మండుతుండడంతో రహదారులపై ఎండమావులు ఏర్పడుతున్నాయి. డిచ్‌పల్లి వద్ద 44 నంబర్ జాతీయ రహదారిపై ఇలా ఎండమావులు కనిపించాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

న్యూస్‌రీల్

వీడియో కాన్ఫరెన్స్ సేవలను ప్రారంభించనున్న సీఎం

- జిల్లాలో సిద్ధమైన నాలుగు రైతు వేదికలు



డొంకేశ్వర్(ఆర్మూర్): రైతు వేదికల్లో అందుబాటులోకి వచ్చిన వీడియో కాన్ఫరెన్స్ సేవలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇందుకు జిల్లాలో నాలుగు రైతు వేదికలను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేశారు. మెంట్రాజ్‌పల్లి, ఆర్మూర్, ముప్కాల్, ఎడపల్లి రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. పరికరాల కోసం ఒక్కో రైతు వేదికలో రూ. 22 లక్షలు వెచ్చించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సేవలను వర్చువల్‌గా హైదరాబాద్ నుంచి సీఎం ప్రారంభించనున్న నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలో కూడా రైతు వేదికల్లో కూడా వీసీ సేవలను ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సేవలను ప్రారంభించిన అనంతరం సీఎం రైతులతో మాట్లాడే అవకాశం ఉంది. ఇందుకు రైతులను, ప్రజాప్రతినిధులను కార్యక్రమాలకు ఆహ్వానించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలందాయి.

సీఎంసీని సందర్శించిన కలెక్టర్, సీపీ



నిజామాబాద్ రూరల్: డిచ్‌పల్లిలోని సీఎంసీ కళాశాలను మంగళవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సందర్శించారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా నిర్వహణ పరమైన ఏర్పాట్లలో భాగంగా ఓట్ల లెక్కింపు కోసం కాలేజీ అనుకూలంగా ఉంటుందని నిర్ణయించారు. ఓట్ల లెక్కింపు, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూంలు, రవాణా, పార్కింగ్ సదుపాయాలను పరిశీలించారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్, స్ట్రాంగ్ రూంల కోసం అందుబాటులో ఉన్న గదులను పరిశీలించారు. భవనంలోని పలు గదుల్లో నిర్వహణపరమైన లోపాలు ఉండడంతో వాటిని శుభ్రం చేయించి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ పనులను తక్షణమే ప్రారంభించాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆర్డీవో రాజేంద్రకుమార్, రాజాగౌడ్, మధుసూదన్, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ హనుమంత్ రావు, ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, జిల్లా అటవీ శాఖ అధికారి మురళి మనోహర్ రెడ్డి ఉన్నారు.

ధాత్రి టౌన్‌షిప్‌లో రైతుల భూమి

- పట్టించుకోని అధికారులు
- కోర్టును ఆశ్రయించిన బాధితులు
- అనుకూలంగా తీర్పురావడంతో భూమి అప్పగించాలని వినతి



నిజామాబాద్‌రూరల్: మల్లారంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాత్రి టౌన్‌షిప్‌లో రైతుల భూమి ఆక్రమణకు గురైంది. మల్లారంలోని పసుల నర్సింగ్‌రావు, పసుల మనోహర్‌లకు ధాత్రి టౌన్‌షిప్ వద్ద సుమారు మూడెకరాల భూమి ఉంది. అయితే గతంలో వెంచర్ చేస్తున్న సమయంలో అధికారులు బాధితులకు చెందిన భూమిలో రోడ్డు వేసి 16 గుంటల ఆక్రమించారు. ఈ విషయమై బాధితులు అధికారుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో ప్రజావాణిలోనూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల కోర్టు వీరికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు కాపీలను అధికారులకు ఇచ్చినా కాలయాపన చేస్తున్నారని వాపోయారు. మంగళవారం తమ భూమిలో వేసిన రోడ్డును చదును చేయించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూమిని తిరిగి అప్పగించాలని.. లేకపోతే తమకు ఆత్మహత్యే శరణమని ఆవేదన వ్యక్తం చేశారు.

మహా అనుసంధానం

- వేగంగా ఫోర్ వే రోడ్డు పనులు
- మంజీరపై భారీ వంతెన



సాలూర శివారులోని మంజీర నదిపై నిర్మించిన నాలుగు వరుసల రోడ్డు, సెంట్రల్ లైటింగ్

బోధన్: జాతీయ రహదారి 63కు అనుసంధానం చేస్తూ బోధన్ పట్టణ శివారు నుంచి సాలూర అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు స్పీడ్ అందుకున్నాయి. ఏడాదిన్నర క్రితమే పనులను ప్రారంభించినప్పటికీ రెండు నెలల నుంచి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. తెలంగాణ – మహారాష్ట్ర మధ్య ప్రధాన మార్గమైన సాలూర అంతర్‌రాష్ట్ర రోడ్డు విస్తరణతో రెండు రాష్ట్రాల మధ్యనే కాకుండా.. ఉత్తర, దక్షిణ భారత దేశాల్లోని రాష్ట్రాలకు రవాణా సాకర్యం మరింత సులభం కానుంది.

రోడ్డు విస్తరణ పనులు ఇలా..

బోధన్ పట్టణ శివారులోని మర్రిమైసమ్మ ఆలయం సమీపం నుంచి మండలంలోని నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామాల మీదుగా సాలూర అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వరకు 8.3 కిలోమీటర్ల వరకు నాలుగు వరుసల రోడ్డు విస్తరణ చేపట్టారు. పాత డబుల్ బీటీ రోడ్డు విస్తరణతోపాటు మూడు గ్రామాల శివార్లలో 4.5 కిలో మీటర్ల బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఇందుకోసం వ్యవసాయభూములను సేకరించి రైతులకు పరిహారం చెల్లించారు. నాగన్‌పల్లి గ్రామ శివారులోని పసుపువాగు పాత వంతెనకు ఎగువ భాగంలో హైలెవల్ వంతెన పనులు కొనసాగుతుండగా, బైపాస్ రోడ్డు పనులు వివిధ దశలో ఉన్నాయి. మరో రెండు, మూడు నెలల్లో బైపాస్ రోడ్డు, విస్తరణ పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయి. రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం రూ.35 కోట్లు మంజూరు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

వంతెన నిర్మాణం

మంజీర నదిపై హై లెవల్ భారీ వంతెన నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. నిజాం హయాంలో 1932నిర్మించిన వంతెన మీదుగా వర్షాకాలంలో నీరు ప్రవహించడంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయేవి. 1984–85లో ఉమ్మడి ఏపీ, మహారాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి పాత వంతెనకు దిగువన హై లెవల్ వంతెనను నిర్మించగా, ఆ వంతెన సైతం దెబ్బతిని శిధిలావస్థకు చేరింది. నాలుగేళ్ల క్రితం మహారాష్ట్ర ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు గుర్తించి కొత్త వంతెన కోసం ప్రతిపాదనలు చేశారు. పాత లో లెవల్, హై లెవల్ వంతెన మధ్య కొత్త వంతెనను నిర్మించారు.

రూ.120 కోట్లతో..

రోడ్డు విస్తరణకు సంబంధం లేకుండా వంతెన నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.120 కోట్లు మంజూరు చేసింది. కాగా వంతెన నిర్మాణ పనులన్నింటినీ మహారాష్ట్ర ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షిస్తోంది. వంతెన పై నాలుగు వరుసల రోడ్డు ఉండే విధంగా రెండు వరుసల్లో వంతెన చేపట్టారు. వంతెనకు ఇరువైపులా కిలో మీటరు వరకు నాలుగు వరుసల రోడ్డు, డివైడర్లు నిర్మించారు. వంతెనపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. భారీ వంతెన నిర్మాణంతో మంజీర తీరంలో రూపురేఖలు మారిపోయాయి.

సేవా కేంద్రాలను పర్యవేక్షించాలి

- అర్హులందరికీ రూ. 500లకే గ్యాస్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌నాగారం: ప్రజాపాలన సేవా కేంద్రాల నిర్వహణను పర్యవేక్షించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలను జిల్లాలోని అర్హులందరూ సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. మంగళవారం ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదు విధానంపై కలెక్టర్లతో విద్యుత్ శాఖ కార్యదర్శి రిజ్వీ, ఇతర రాష్ట్రస్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరాలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజాపాలన సేవా కేంద్రాల ఆపరేటర్లతో వీసీలో మాట్లాడారు. ప్రజా పాలన సేవా కేంద్రాల ద్వారా అర్హులైన లబ్ధిదారుల వివరాలను సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్ చేయించి ఆన్‌లైన్‌లో పంపించాలన్నారు. ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని.. అర్హులకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తు సమయంలో వివరాలు సరిగ్గా నమోదు చేయని దరఖాస్తుదారుల కోసం సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు, జెడ్పీ సీఈవో ఉష, డిప్యూటీ సీఈవో సుందర వరదరాజన్, డీపీవో చక్రవర్తి తరుణ్ కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, కార్పొరేషన్ కమిషనర్

వైద్యారోగ్యశాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యారోగ్యశాఖలో మూడు పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుదర్శనం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎపిడమాలజిస్ట్–1, న్యూట్రీషన్ కౌన్సిలర్–1, జిల్లా ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ –1 పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 6 నుంచి 11 వరకు కలెక్టరేట్‌లోని 202 వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. పూర్తివివరాలకు nizamabad.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

వివాహిత ఆత్మహత్యతో ఉద్రిక్తత

- భర్త ఇంటిపై మృతురాలి బంధువుల దాడి..
- తలుపులు, ఇంట్లోని వస్తువులు ధ్వంసం
- న్యాయం చేయాలని సాయంత్రం వరకు కొనసాగిన నిరసన
- గ్రామానికి చేరుకున్న ప్రొబేషనరీ ఎస్పీ, డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు
- పోలీస్ బందోబస్తు మధ్య మృతదేహం తరలింపు



అరుణ (ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అత్తింటి వేధింపులు భరించలేక ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా.. ఆమె తరపు బంధువులు విధ్వంసం సృష్టించారు. సదాశివనగర్ మండలం ధర్మారావ్‌పేట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. దోమకొండ మండలం చింతమాన్‌పల్లికి చెందిన నీల అరుణ(21)ను ఏడాది క్రితం ధర్మారావ్‌పేట్ గ్రామానికి చెందిన దొంతర బోయిన అనిల్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. పెళ్లయిన నాటి నుంచి అరుణకు అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. ఆమె భర్త ఇటీవల విదేశాల నుంచి వచ్చాడు. మంగళవారం వ్యవసాయ బావి వద్ద భోజనం ఇవ్వడానికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అరుణ మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లారు. అప్పటికే అరుణ మృతదేహం ఫ్యాన్‌కు వేళాడుతోంది. వెంటనే పోలీసులకు, మృతురాలి బంధువులకు సమాచారం అందించారు. ధర్మారావ్‌పేట్‌కు చేరుకున్న మృతురాలి బంధువులు ఇంట్లోని వస్తువులను, తలుపులను ధ్వంసం చేశారు. అక్కడికి చేరుకున్న ఎస్సై రాజు పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్పెషల్ ఫోర్సు బలగాలను రప్పించారు. ఆందోళన చేస్తున్న వారిని చెదరగొట్టారు. బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఇరువర్గాలతో మాట్లాడారు. అయితే న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తీసేది లేదని మృతురాలి బంధువులు స్పష్టం చేశారు. రూ. 60 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒప్పందం చేసుకున్న అనంతరం మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టంకు తరలించారు. మృతురాలి తండ్రి నీల స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు విచారణ అధికారి ప్రొబేషనరీ ఎస్పీ కాజల్ పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నిజామాబాద్ రూరల్: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అందరికీ అందేలా కృషిచేయాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో వివిధ శాఖలపై నిర్వహించి స్థాయీ సంఘ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రజా పాలన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్‌ను పాటించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో పరిశుభ్రతను పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో మొక్కలను సంరక్షించే బాధ్యత పంచాయతీలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇసుక క్వారీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి అక్రమ రవాణా జరుగకుండా చూసుకోవాలని మైన్స్‌శాఖ అధికారుకు సూచించారు. సమావేశాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ రజిత ఎల్లయ్య యాదవ్, జెడ్పీ సీఈవో ఉష, డిప్యూటీ సీఈవో సుందర వరదరాజన్, జెడ్పీటీసీ సభ్యులు సిరికొండ మాన్సింగ్, రుద్రూర్ నారోజి గంగారం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

- సీనియర్ హెచ్‌ఎంలకే సీఎస్‌వో, డీవోల బాధ్యతలు
- 140 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- సెల్‌ఫోన్‌లపై పూర్తిగా నిషేధం
- ఏర్పాట్లు చేస్తున్న జిల్లా విద్యాశాఖ



నగరంలోని ఖిల్లా పాఠశాల పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న డీఈవో

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి పరీక్షలు ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పరీక్షల నిర్వహణ కోసం ఉన్నతాధికారులు 140 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈసారి పరీక్ష కేంద్రాలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా సీనియర్ ప్రధానోపాధ్యాయులను మాత్రమే కేటాయించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాలను గుర్తించిన అధికారులు పరీక్షల నిర్వహణ అధికారులకు రెండు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా సెల్‌ఫోన్లపై నిషేధం, ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని శిక్షణలో వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ఏర్పాట్లను కూడా పూర్తిచేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ సెంటర్ల నిర్వహకులతో నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు.

మాస్ కాపీయింగ్ నిరోధానికి ఏర్పాట్లు


పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా గట్టి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం కేంద్రాల వద్ద పర్యవేక్షణతో పాటు, సీసీ కెమెరాల వినియోగం, ప్రశ్నాపత్రాలు సెంటర్‌కు వచ్చిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్లు ఉపయోగించకుండా చూడడం లాంటి చర్యలు తీసుకోనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. బయటి వ్యక్తులను లోపలికి అనుమతించబోరు. జిరాక్స్ సెంటర్లను సైతం మూసివేయించనున్నారు.

మేనేజ్‌మెంట్	స్కూళ్ల సంఖ్య	విద్యార్థులు
ఎయిడెడ్	7	485
ఆశ్రమ	3	34
బీసీ వెల్ఫేర్	12	766
ప్రభుత్వ	25	1120
కేజీబీవీ	25	835
ప్రైవేటు	191	8695
మైనారిటీ	17	684
మోడల్	10	945
రెసిడెన్షియల్	3	207
సోషల్ వెల్ఫేర్	9	677
ట్రైబెల్ వెల్ఫేర్	2	147
జెడ్పీ	224	7298
మొత్తం	528	21,893

పరీక్ష రాయనున్న 21,893 మంది విద్యార్థులు

జిల్లాలో ఏడాది పదో తరగతి పరీక్షలకు సంబంధించి 21,893 మంది పరీక్షలు రాయనున్నారు ఇందులో బాలురు 11,158, బాలికలు 10,735 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రైవేటుగా 380 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటలకు వరకు ఎగ్జామ్స్ కొనసాగుతాయి. ఈసారి నూతనంగా సైన్స్ సబ్జెక్టుకు సంబంధించి బయోలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ పరీక్షలు వేర్వేరు రోజుల్లో నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు కొనసాగనుంది. హిందీ పరీక్ష మాత్రం మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరగనుంది. అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. ప్రశ్నాపత్రాలు రెండు రోజుల క్రితమే జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి.

ఏర్పాట్లు పూర్తిచేశాం



పదో తరగతి పరీక్షలను పగడ్బందీగా నిర్వహిస్తాం. ఎలాంటి లోపాలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా చేస్తున్నాం. ఇప్పటికే పరీక్ష నిర్వహణ అధికారులకు శిక్షణ ఇచ్చాం. సెల్‌ఫోన్ల పూర్తిగా నిషేధించడం జరిగింది.
– దుర్గాప్రసాద్, డీఈవో

21న అవిశ్వాస పరీక్ష

- డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డిపై..
- నోటీసులు జారీ చేసిన డీసీవో శ్రీనివాస్

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డిపై అవిశ్వాస పరీక్షకు తేదీ ఖరారైంది. ఈ నెల 21న డీసీసీబీ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్మన్‌తో పాటుగా డైరెక్టర్లకు జిల్లా సహకార శాఖ అధికారి(డీసీవో) శ్రీనివాస్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. డీసీసీబీ బ్యాంకుకు వెళ్లిన ఆయన రికార్డులను పరిశీలించారు. డైరెక్టర్ల సంతకాలు సరైనవో కాదో సరి చూసుకున్నారు. భాస్కర్ రెడ్డి తమకు చైర్మన్‌గా వద్దని సోమవారం 15 మంది డైరెక్టర్లు డీసీవోకు లేఖను అందజేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సహకార శాఖ నిబంధనల ప్రకారం చైర్మన్‌పై అవిశ్వాస పరీక్షకు డీసీవో కసరత్తు చేపట్టారు. అయితే అవిశ్వాసం పెట్టిన డైరెక్టర్లు ఇంకా క్యాంపులోనే ఉన్నారని తెలుస్తోంది. అవిశ్వాస పరీక్షను నెగ్గి చైర్మన్ పదవిని కాపాడుకోవడానికి భాస్కర్ రెడ్డికి పక్షం రోజుల పాటు సమయం ఉంది. ఈలోపు డీసీసీబీ రాజకీయ ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



నిజామాబాద్‌రూరల్‌(డిచ్‌పల్లి): క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ యాదగిరి అన్నారు. సోమవారం నిర్వహించిన తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్‌ కాలేజీ క్రికెట్‌ మెన్‌ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గెలుపోటములు సహజమని, రెండింటినీ సమానంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, ట్రోఫీని అందజేశారు. టోర్నీలో మొత్తం 12జట్లు పాల్గొన్నాయి. తెలంగాణ యూనివర్సిటీ స్పోర్ట్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ బాలకిషన్‌, చీఫ్‌ గార్డెన్‌ మహేందర్‌, గిరిరాజ్‌ కళాశాల ఫిజికల్‌ డైరెక్టర్‌ బాలమణి, డాక్టర్‌ బీఆర్‌ నేత, జూనియర్‌ అసిస్టెంట్‌ నరేశ్‌, ఆయా కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌రూరల్‌(డిచ్‌పల్లి): ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (డిచ్‌పల్లి) ఆధ్వర్యంలో మగ్గంవర్క్‌, టైలరింగ్‌, బ్యూటీ పార్లర్‌ శిక్షణ ప్రారంభమవుతాయని సంస్థ డైరెక్టర్‌ సుంకం శ్రీనివాస్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గంవర్క్‌, ఉమెన్స్‌ టైలరింగ్‌, బ్యూటీ పార్లర్‌ మేనేజ్‌మెంట్‌, జ్యూట్‌ బ్యాగ్స్‌ మేకింగ్‌, ఆర్టిఫిషియల్‌ జువెలరీ తయారీలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 19 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉండి ఆసక్తి గల నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంత యువతులు శిక్షణలో చేరాలని సూచించారు. శిక్షణ కాలంలో భోజనం, హాస్టల్‌ సదుపాయలు ఉచితంగా ఉంటాయని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌తో పాటు టూల్‌కిట్‌ను అందజేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 08461 295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రీడాకారిణికి ఘనస్వాగతం



ఆర్మూర్‌టౌన్‌: సాఫ్ట్‌బాల్‌ క్రీడాకారిణి అజ్మీర ఇందుకు ఆర్మూర్‌ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు సోమవారం ఘన స్వాగతం పలికారు. ఇటీవలే జాతీయస్థాయిలో సాఫ్ట్‌బాల్‌ క్రీడలో కెప్టెన్‌గా వ్యవహరించి జట్టుకు బంగారు పతకం సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్‌ ధనవేణి తెలిపారు. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని బంగారం పతకం సాధించడం గర్వంగా ఉందన్నారు. తోటి విద్యార్థినులు అజ్మీర ఇందును స్ఫూర్తిగా తీసుకొని విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థినులు అజ్మీర ఇందును అభినందించారు.

ఇంటి ముందు నుంచి బైక్‌ చోరీ

నిజాంసాగర్‌(జుక్కల్‌): మహమ్మద్‌నగర్‌ మండల కేంద్రానికి చెందిన బొర్ర నరేశ్‌ ఇంటి ముందు పార్క్‌ చేసిన ద్విచక్ర వాహనాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గతంలో బైక్‌లలో నుంచి పెట్రోల్‌ దొంగిలించారని, ఇప్పుడు ఏకంగా బైక్‌ను ఎత్తుకెళ్లారని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్‌ చేయకపోవడంతోనే తరచూ చోరీ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అంటున్నారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమయ పాలన పాటించాలి

- ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశం
- 131 ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ హనుమంతు, అధికారులు

నిజామాబాద్‌నాగారం: సమయపాలన పాటిస్తూ ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌, ట్రైనీ అదనపు కలెక్టర్‌ కిరణ్మయి, డీఆర్డీవో సాయాగౌడ్‌ ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 131 ఫిర్యాదులు అందాయి.

మళ్లీ ఉద్యోగాలు ఇవ్వాలి

కొవిడ్‌ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలందించిన అవుట్‌ సోర్సింగ్‌ స్టాఫ్‌ నర్సుల తొలగింపు అన్యాయమని, వారికి మళ్లీ ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్‌ కలెక్టర్‌కు విన్నవించారు. ఐదేళ్లపాటు విధులు నిర్వహించిన పది మంది అవుట్‌ సోర్సింగ్‌ స్టాఫ్‌ నర్సులను రాత్రికిరాత్రి తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఆమెవెంట సంధ్యారాణి, శకుంతల, దివ్య, రేవతి, శ్రీలత, సల్మా తదితరులున్నారు.

హాస్టళ్లలో అధికారులు బస చేయాలి

సంక్షేమ హాస్టళ్లను అధికారులు పర్యవేక్షించడంతోపాటు రాత్రి వేళల్లో అక్కడే బస చేయాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక, గిరిజన విద్యార్థి సంఘం, తెలంగాణ స్టూడెంట్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు విన్నవించారు. బోధన్‌లోని బీసీ కళాశాల హాస్టల్‌లో విద్యార్థి వెంకట్‌ను హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వార్డెన్‌, నైట్‌ వాచ్‌మెన్‌ లేకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని, బాధ్యులను సస్పెండ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో విద్యార్థి సంఘాల నాయకులు రమావత్‌ లాల్‌సింగ్‌, జైత్రాం రాథోడ్‌, మహేశ్‌రెడ్డి తదితరులున్నారు.

హెచ్‌ఎంపై ఫిర్యాదు

ఎస్టీ కుల సంఘం అధ్యక్షుడిగా ఉంటూ ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్టీ సంఘం నాయకులు నర్సింహులు, గంగాధర్‌, పోశెట్టి, భూదేవి, గంగుబాయి, లక్ష్మి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వేల్పూర్‌ మండలంలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న గాండ్ల రాంచందర్‌ బ్యాంకు లోన్లు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఈ విషయమై డీఈవో, సీపీకి సైతం ఫిర్యాదు చేశామన్నారు. హెచ్‌ఎంపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

కులం నుంచి బహిష్కరించారు..



ఎస్సీ కుల పెద్దమనుషులు తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ కులం నుంచి బహిష్కరించారని కోటగిరికి చెందిన స్వాతి తన కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కుల బహిష్కరణ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని, ఫిబ్రవరి 19వ తేదీన బేగరి రాములు, పాల గంగారాం వారి అనుచరులతో కలిసి తమను చంపేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని స్వామి కోరారు.

మా భూమిని ఆక్రమిస్తున్నారు..



తమ సొంత వ్యవసాయభూమిలో సాగు చేసుకుంటుండగా కొంత మంది వ్యక్తులు వచ్చి అడ్డుకుంటున్నారని డిచ్‌పల్లి మండలం సుద్దపల్లికి చెందిన రవి కుటుంబ సభ్యులతో కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. భూమిలోకి వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పాత, కొత్త పట్టాపాస్‌ పుస్తకాలు ఉన్నా.. కొందరు తమ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని తమకు న్యాయం చేయాలని కోరారు.

ఎన్నికల హామీలను నెరవేరుస్తాం

- అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- మాజీ మంత్రి, బోధన్‌ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి
- బోధన్‌, ఎడపల్లి మండలాల్లో 'గృహజ్యోతి' ప్రారంభం



బోధన్‌ మండలంలోని సంగంలో బిల్లింగ్‌ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్‌/ఎడపల్లి(బోధన్‌): ఎన్నికల హామీలన్నింటినీ నెరవేరుస్తామని మాజీ మంత్రి, బోధన్‌ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోధన్‌ మండలం సంగం గ్రామంతోపాటు ఎడపల్లి మండల కేంద్రంలో గృహజ్యోతి పథకాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. సంగంలో తానే స్వయంగా మీటర్‌ రీడింగ్‌ తీసి వినియోగదారుకు జీరో బిల్లును అందజేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్య శ్రీ., రూ.500లకే గ్యాస్‌ సిలిండర్‌, 200 యూనిట్ల ఉచిత కరెంట్‌ హామీలను అమలు చేస్తున్నామని, త్వరలోనే పూర్తి స్థాయిలో ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజలకు అండ నిలుస్తామన్నారు. సోషల్‌ మీడియాలో తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సుదర్శన్‌రెడ్డి ఎన్నికల్లో విజయం సాధిస్తే ఆలయంలో 101 కొబ్బరికాయలు కొడతానని ఎడపల్లికి చెందిన కాంగ్రెస్‌ నాయకుడు బొబ్బిలి శ్రీనివాస్‌ మొక్కుకున్నాడు. ఈ మేరకు సోమవారం సుదర్శన్‌రెడ్డి మార్కండేయ మందిరంలో కొబ్బరియకొట్టగా, మిగతావి స్థానిక నాయకులు కొట్టారు. విద్యుత్‌ శాఖ డివిజన్‌ అధికారి మహ్మద్‌ ముక్తార్‌, ఎడీ లక్ష్మణ్‌నాయక్‌, ఏఈ నాగేంద్ర ప్రసాద్‌ రెడ్డి, తహసీల్దార్‌ ధన్వల్‌, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంపీవో సుభాష్‌ చంద్రబోస్‌, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, జిల్లా పరిషత్‌ వైస్‌ చైర్‌పర్సన్‌ రజితాయాదవ్‌, కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు మనాల మో హన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌, సింగిల్‌ విండో చైర్మన్‌ మాల్కారెడ్డి, నాయకులు బిల్లా రామ్మోహన్‌, ఈరంటి లింగం, బంజ కమప్ప, సుభాష్‌, పోతన్న, మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అమానుల్లా షరీఫ్‌, రామ్‌గోపాల్‌రెడ్డి, ప్రమీల, ఫర్హాన్‌, రత్నాకర్‌, నవీన్‌ తదితరులు పాల్గొన్నారు.

చక్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి జాతర బ్రహోత్సవాలను పురస్కరించుకొని బోధన్‌ పట్టణంలోని చక్రేశ్వరాలయంలో ఎమ్మెల్యే సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఒకటో తేదీన జీతాల చెల్లింపు హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవోస్‌ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్‌

నిజామాబాద్‌నాగారం: ఒకటో తారీకునే ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పింఛన్ల చెల్లింపు హర్షణీయమని, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఎంప్లాయిస్‌ జేఏసీ చైర్మన్‌, టీఎన్జీవోస్‌ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్‌ అన్నారు. కలెక్టరేట్‌లోని టీఎన్జీవోస్‌ భవనంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా జీతాలు, పింఛన్లు ఒకటో తేదీన చెల్లించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టువిక్రమార్క, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యే మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్ట్‌ ఉద్యోగులను రెగ్యులర్‌ చేస్తూ సీఎం ఉత్తర్వులు అందజేశారన్నారు. అలాగే, కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్‌ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఎంప్లాయిస్‌ హెల్త్‌స్కీమ్‌, పెండింగ్‌ బిల్లులు, డీఏలను త్వరితగతిన చెల్లించాలని కోరారు. ఉద్యోగులందరం రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వహిస్తూ, రాష్ట్ర ఆర్థికాభివద్ధికి తోడ్పడుతామని హామీ ఇచ్చారు. టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్‌, కేంద్ర బాధ్యులు పోల శ్రీనివాస్‌, సతీశ్‌, సలహాదారులు ఆకుల ప్రసాద్‌, జిల్లా కార్యవర్గ సభ్యులు సంజీవయ్య, మహిళా విభాగం జిల్లా కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి, ఇందిర, గీతారెడ్డి, పుష్ప పాల్గొన్నారు.

ఆగని వన్యప్రాణుల వేట

- చర్చనీయాంశమైన అన్నారం ఘటన
- పేలింది అడవి పందులను వేటాడే గొలా
- తనిఖీలు నిర్వహించిన బాంబ్‌ స్క్వాడ్‌



అన్నారంలో తనిఖీలు చేస్తున్న బాంబు స్క్వాడ్‌

రామారెడ్డి: మండలంలోని అన్నారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్న పేలుడు ఘటనకు అడవి పందులను వేటాడేందుకు ఉపయోగించే 'గొలా' కారణమని తెలుస్తోంది. ఈ ఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పేలుడు సంభవించిన దండుగుల రవీందర్‌ ఇంట్లో సోమవారం బాంబ్‌ స్క్వాడ్‌ తనిఖీలు నిర్వహించారు. ఇంకా ఏమైనా పేలుడు పదార్థాలు ఉన్నాయేమోనని తనిఖీలు చేసినట్లు ఎస్సై విజయ్‌ కొండ తెలిపారు. ఈ ఘటనలో రవీందర్‌ భార్య శిరీష గాయాలపాలు కాగా, ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. అయితే, తనిఖీలు నిర్వహించిన పోలీసులు అటవీ జంతువులను వేటాడేందుకు పేలుడు కోసం ఉపయోగించే బ్యాటరీతోపాటు వైరును స్వాధీనం చేసుకున్నారు. అదే ఇంట్లో చిన్నసైజు బోనుతోపాటు వల ఉన్నట్లు తెలిసింది. మాచారెడ్డి రేంజ్‌ అధికారిణి దివ్య 'అన్నారం' ఘటనపై స్పందించారు. అటవీ జంతువుల వేట చట్ట ప్రకారం నేరమని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యథేచ్ఛగా వేట?

అటవీజంతువుల వేట యథేచ్ఛగా కొనసాగుతోందని అన్నారం ఘటన మరోసారి రుజువుచేసింది. మండలంలోని మద్దికుంట, రెడ్డిపేట, సింగరాయపల్లి, అన్నారం శివార్లలోని అటవీప్రాంతంలో జంతువుల వేట జోరుగా సాగుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఏడాది కిత్రం సింగరాయపల్లి అటవీ ప్రాంతంలో వేటకు వెళ్లి బండరాళ్ల మధ్యలో రాజు అనే వ్యక్తి ఇరుక్కున్న ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయినప్పటికీ అటవీశాఖ అప్రమత్తం కావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.లక్షా 40వేలకు.. రూ.11కోట్లు!

- 'జెనిక్యూ' కాయిన్‌ పేరుతో టీచర్ల దందా
- దుబాయి కేంద్రంగా చలామణి అవుతోందని ప్రచారం
- సీపీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న బాధితుడు



ఖలీల్‌వాడి: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు 'జెనిక్యూ' కాయిన్‌ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. బిట్‌కాయిన్‌ తరహాలోనే జెనిక్యూ ఉంటుందని ప్రచారం చేస్తూ ముగ్గురు టీచర్లు జిల్లాలో పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. వివిధ మండలాల్లో పని చేస్తూ ఆ ముగ్గురు టీచర్లు స్నేహితులు, సహోద్యోగులు, బంధువులను నమ్మిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తమకు డబ్బులు చెల్లిస్తే ఐడీ, పాస్‌వర్డ్‌ ఇప్పిస్తామని, ఐదేళ్లలో రూ.లక్షా 40 వేలకు రూ.11కోట్లు, రూ.70వేలు చెల్లిస్తే రూ.5.50 కోట్ల రిటర్న్స్‌ వస్తాయని నమ్మబలుకుతున్నారు. ఆ టీచర్లను నమ్మి పలువురు డబ్బులు చెల్లించినట్లు తెలిసింది. 2022 నుంచి ముగ్గురు టీచర్లు జెనిక్యూ కాయిన్‌ దందా చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి శేఖర్‌బాబు తాను చెల్లించిన డబ్బులను తిరిగి ఇవ్వాలని కాయిన్‌ దందా చేస్తున్న టీచర్లను కోరగా, ఐదేళ్ల వరకు డబ్బుల కోసం ఆగాల్సిందేనని తెగేసి చెబుతున్నారు. తనకు డబ్బులు తిరిగి ఇవ్వకుంటే కమిషనర్‌ ఆఫ్‌ పోలీస్‌ను ఆశ్రయిస్తానని బాధితుడు అంటున్నాడు.

చిరుతను బంధించాలి

- డీఎఫ్‌వోకు అక్బర్‌నగర్‌వాసుల వినతి



డీఎఫ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రుద్రూర్‌: మండలంలోని అక్బర్‌నగర్‌ శివారులో సంచరిస్తున్న చిరుతను బంధించాలని కోరుతూ అంబేడ్కర్‌కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు జిల్లా అటవీశాఖ అధికారి వికాస్‌ మీనాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం మేకపై చిరుత దాడి చేసి చంపివేసిందన్నారు. అలాగే రెండు నెలల క్రితం గ్రామ శివారులోని గుట్ట ప్రాంతంలో మేతకు వెళ్లిన ఆవుపై, వ్యవసాయ పరిశోధన కేంద్రం పరిసరాల్లో అడవి పందిపై దాడి చేసిందన్నారు. బోను ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంబేడ్కర్‌ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎం మశ్చేందర్‌, గౌరవ అధ్యక్షుడు డి భీమప్ప, ప్రచార కార్యదర్శి రాజ్‌కుమార్‌, రాహుల్‌కుమార్‌, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం



కాలిన సంచులను పరిశీలిస్తున్న ఎస్సై సాయికుమార్‌

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని సప్తగిరి రైస్‌మిల్లులో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించినట్లు ఎస్సై సాయికుమార్‌ సోమవారం తెలిపారు. రైస్‌ మిల్లులోని ప్యానల్‌ బోర్డు నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగి 48,200 బర్దాన్‌ సంచులు, 114 క్వింటాళ్ల బాయిల్డ్‌ రైస్‌, 15హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటార్లు కాలిపోయాయని రైస్‌మిల్లు యజమానులు ఫిర్యాదు చేశారన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా చేసినట్లు ఎస్సై తెలిపారు.

డబ్బుల విషయంలో కత్తితో దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని గంజ్‌ ప్రాంతం రైల్వేలైన్‌ వద్ద సోమవారం కత్తిపోట్ల ఘటన చోటు చేసుకుంది. డబ్బుల విషయంలో ఖండోబా, దస్తగిరి మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలో దస్తగిరి ఖండోబాపై కత్తితో దాడి చేశాడు. గాయాలపాలైన ఖండోబాను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఖండోబా బతుకుదెరువు కోసం కొంత కాలం క్రితం మహారాష్ట్ర నుంచి నిజామాబాద్‌కు వచ్చినట్లు తెలిసింది. మూడో టౌన్‌ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో రెండురోజుల జైలుశిక్ష

భిక్కనూరు: మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు ఎస్సై సాయికుమార్‌ సోమవారం తెలిపారు. పాల్వంచ మండలకేంద్రానికి చెందిన వ్యక్తి మద్యం సేవించి బైక్‌ నడుపగా కేసు నమోదు చేశామన్నారు. కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి సదరు వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

రుద్రూర్‌: కోటగిరి శివారులోని గుట్ట ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఏడుగురి సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. పట్టుబడ్డవారి నుంచి రూ.19,640 నగదు స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చింతపండు దొంగతనం కేసు నమోదు

బోధన్‌టౌన్‌(బోధన్‌): బోధన్‌ పట్టణంలో చింతపండు దొంగతనం చేయడానికి వచ్చి దాడి చేసిన వారిపై కేసునమోదు చేసినట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నిజాం చక్కెర కర్మాగారం ఆవరణలోని చింత చెట్టు కాయలను దొంగిలించేందుకు గుర్తు తెలియని వ్యక్తులు రాగా, వాచ్‌మెన్‌ అడ్డుకున్నాడు. సదరు వ్యక్తులు వాచ్‌మెన్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా 'కారుణ్య' పోస్టు

- వైద్యారోగ్యశాఖలో పదకొండేళ్లుగా కొనసాగుతున్న ఉద్యోగి
- తమ దృష్టికి రాలేదంటున్న డీఎంహెచ్‌వో



శ్రీకాంత్‌ సమర్పించిన ఫ్యామిలీ మెంబర్‌ సర్టిఫికెట్‌

నిజామాబాద్‌నాగారం: నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి వైద్యారోగ్యశాఖలో ఉద్యోగి విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా భద్రాచలం మండలం తోటపల్లికి చెందిన సదరు ఉద్యోగి ప్రస్తుతం రెంజల్‌ మండలంలోని సాలూర పీహెచ్‌సీలో సీనియర్‌ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మచ్చ సత్యనారాయణ వైద్యారోగ్యశాఖలో హెల్త్‌ విజిటర్‌గా విధులు నిర్వర్తిస్తూ మరణించాడు. ఆయనకు మొదటి భార్య స్వరూపారాణి గృహిణి కాగా, భద్రాచలం మండలం గౌరీదేవిపేట పీహెచ్‌లో హెల్త్‌ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వాణిని సత్యనారాయణ రెండో వివాహం చేసుకున్నారు. ఆమె ఇప్పటికీ ఉద్యోగంలో కొనసాగుతున్నట్లు తెలిసింది. అసలు కథ ఇక్కడే మొదలైంది.. గృహిణి అయిన స్వరూపారాణికి ఇద్దరు కొడుకులు శ్రీకాంత్‌, చరణ్‌తేజ కాగా, రెండో భార్యకు ఇద్దరు పిల్లలున్నారు. నిబంధనల ప్రకారం కారుణ్య పద్ధతిలో ఉద్యోగం పొందాలంటే ఇంట్లో ఒక్కరికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగం ఉండి, సదరు ఉద్యోగి మరణిస్తే వారసులు అర్హులు. అయితే సత్యనారాయణతోపాటు ఆయన రెండో భార్య సైతం ప్రభుత్వ ఉద్యోగులైనప్పటికీ.. ఎలాగైనా తన తండ్రి ఉద్యోగం పొందాలని ప్రయత్నాలు మొదలు పెట్టిన శ్రీకాంత్‌ తన తండ్రికి ఒక భార్య, నలుగురు సంతానమని నకిలీ సర్టిఫికెట్‌ను సృష్టించాడు. దానితోపాటు నకిలీ ఇంటర్మీడియెట్‌ సర్టిఫికెట్‌ను సృష్టించి 2013 నవంబర్‌ 26న భద్రాచలం అడిషనల్‌ డీఎంహెచ్‌వో (ట్రైబల్‌)లో జూనియర్‌ అసిస్టెంట్‌గా విధుల్లో చేరాడు. 2022లో నిజామాబాద్‌ జిల్లా సాలూర పీహెచ్‌సీకి సీనియర్‌ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతిపై వచ్చాడు. అక్రమ వర్క్‌ ఆర్డర్లు, డిప్యుటేషన్‌పై మళ్లీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్లినప్పటికీ, డిప్యుటేషన్లు రద్దు కావడంతో తిరిగి సాలూరకు వచ్చాడు. సదరు ఉద్యోగి వ్యవహారంపై ఇప్పటికే జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు 104 డ్రైవర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేసగాని శంకర్‌ తెలిపారు. ఇదిలా ఉండగా, శ్రీకాంత్‌ నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి అక్రమంగా ఉద్యోగంలో చేరినట్లు తమ దృష్టికి రాలేదని డీఎంహెచ్‌వో సుదర్శన్‌ తెలిపారు. పూర్తి సమాచారం తెలుసుకుంటానని అన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో సోమవారం ఇద్దరు మృతి చెందారు. కారు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో తొర్లికొండకు చెందిన వ్యక్తి, లారీని ఓవర్‌ టేక్‌ చేసి వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొనగా జక్రాన్‌పల్లికి చెందిన మరొకరు ప్రాణాలు కోల్పోయారు.

కారు బోల్తాపడి ఒకరు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



సాయిప్రశాంత్‌ (ఫైల్‌)

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ గ్రామ శివారులో కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటన ఏలేటి సాయిప్రశాంత్‌(27) అనే వ్యక్తి మృతి చెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. తొర్లికొండకు చెందిన సాయిప్రశాంత్‌ తన బావ నవీన్‌తో కలిసి ఆర్మూర్‌కు వెళ్తుండగా, కారు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి రెండు పల్టీలు కొట్టింది. సాయి ప్రశాంత్‌కు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, కారు నడుపుతున్న నవీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు నడిపిన నవీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో..

ఆర్మూర్‌టౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి 44వ నంబర్‌ జాతీయ రహదారిపై కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో జక్రాన్‌పల్లికి చెందిన షేక్‌ కరీం(58) మృతి చెందాడు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. షేక్‌కరీం సోమవారం జక్రాన్‌పల్లి నుంచి ఆర్మూర్‌వైపు ద్విచక్రవాహనంపై నిఖిల్‌తో కలిసి వస్తుండగా, వెనుక నుంచి లారీని ఓవర్‌టేక్‌ చేసి వచ్చిన కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన కరీంను 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. స్వల్పగాయాలపాలైన నిఖిల్‌ ఆర్మూర్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్‌ తెలిపారు.